www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 ఆగస్టు 2025
5
చిత్తూరు



12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 12వ తేదీ నేషనల్ డీ వార్మింగ్ డే (జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినంను) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు 1-19 సంవత్సరాల వయసు గల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమం ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు, ప్రాథమిక పాఠశాలలోని, బడి, బడిబయట పిల్లలకు, ప్రాథమికోన్నత పాఠశాలలోని పిల్లలకు ఏఎన్ఎం ద్వారా, ఉన్నత, రెసిడెన్షియల్, ఆశ్రమం, మాడెల్ స్కూల్, కె.జి.బి.వి, గురుకుల, మైనారిటీ పాఠశాలలోని పిల్లలు, ఇంటర్ మీడియట్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్న భోజనము తరువాత మిగించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారుల సహకారంతో ఈ కార్యక్రమన్ని 100శాతం అములు చేయడం జరుగుతుందని తెలిపారు.

వర్ష బీభత్సం.. రైతుకు తప్పని నష్టం..

- కోతకు గురైన పంట పొలాలు
- వానకు వాలిపోయిన కాకర పంట
- నేలకూలిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి- వి కోట

మండల పరిధిలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పండించిన పంటలు నేలకొరిగి తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. మండలంలోని కృష్ణాపురం పంచాయతీ పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పండించిన పంటలు నేలకొరిగాయి. వర్షాలకు రైతుల పొలాల్లో భూములు కోతకు గురయ్యాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు వాలిపోయాయి. ఎడగురికి, కృష్ణాపురం, కొమ్మరమడుగు ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొమ్మర మడుగు చెందిన లక్ష్మప్ప తన పొలంలో వేసిన కాకర పంట పూర్తిగా నేలమట్టమయింది. కోతకు వచ్చిన దశలో పంట నేలకొరగడంతో తీవ్రనష్టం కలిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో కిలో 40 రూపాయల వరకు ధర పలుకుతుండటంతో కోత దశలో ఉన్న పంట నేలకొరవడంతో రైతుకు తీవ్ర నష్టం సంభవించింది. అదేవిధంగా మండల పరిధిలో వేసిన టమాటా, బీన్స్ , బంతి తదితర పంటలు ఈ వర్షాలకు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రైతుల పొలాల్లో దుక్కులు దున్ని వేసిన పంటలు వర్షాలకు భూములు కోతకు గురై పంటలు నేలకొరిగాయి. మరో పక్క విద్యుత్ స్తంభాలు కూడా వాలిపోయాయి. విద్యుత్ అధికారులు సత్వరం స్పందించి ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. గత కొంతకాలంగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న తరుణంలో మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తుండతంతో కొంతమేర రైతులకు ఉపశమనం కలిగిస్తోంది. సంబంధిత ఉద్యాన వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



వర్షాలకు కోతకు గురైన పంట పొలాలు, వర్షాలకు నేలకూలిన విద్యుత్ స్తంభాలు, కొమ్మరమడుగులో నేలకొరిగిన కాకర పంట

చెరువును తలపిస్తున్న బైపాస్ రోడ్డు

పలమనేరు: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల రోడ్లు చాలా మరమ్మతులకు గురికావడమే కాక రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిల్వ చేరి చెరువులను తలపిస్తున్నాయి..పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్ పక్కనున్న సర్వీస్ రోడ్డులోని గుంతల్లో నీరు చేరి వాహన దారులకు రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. అధికారులు వెంటనే ఈ గుంతలను పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



మౌలిక సదుపాయాల కల్పనకు రూ.75 కోట్లు

గిరిజనుల పిల్లలను పాఠశాలలకు పంపాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గిరిజనులు తమ పిల్లలను తప్పక చదివించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక డీఆర్డీఏ సమావేశపు హాల్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ ఆముద, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్‌లతో కలసి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతోందన్నారు ఆదివాసి సమాజాన్ని నేటికీ అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. మారుమూల గిరిజన తండాలకు విద్యుత్తు, రహదారి సదుపాయాలు సరిగా ఉండటం లేదని, జిల్లాలో 60,000 జనాభా గిరిజనులు ఉన్నారని, సుమారు 600 నివాస ప్రాంతాలలో మౌలిక వసతులను గుర్తించడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సుమారు రూ.75 కోట్ల ఖర్చుపెడుతున్నామని, గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుకుని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలోనే మొదటిసారిగా ఆర్ఓఎఫ్ఆర్ చట్టం 2006 ప్రకారం 1 కమ్యూనిటీ క్లెయిం పరిధిలో బంగారుపాళ్యం మండలంలోని తుంబపాళ్యం గ్రామంలోని 50మంది లబ్ధిదారులకు అటవీ ప్రాంతంలో గల చెరువులలో చేపల వేటకు అనుమతులు మంజూరు చేయడం వలన గిరిజన మత్స్య కారుల కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. గిరిజనులకు ఎలాంటి సమస్య వచ్చిన కలెక్టర్ కార్యాలయంలో స్వయంగా నన్ను కలవవచ్చునని, పలమనేరు నియోజకవర్గంలో సోమల మండలంలో, పెట్టూరు గ్రామపంచాయతీలోని ముచ్చుకాలవ 22 మంది యానాది కుటుంబీకులకు ఆర్ఓఆర్ పట్టాదారు పాస్ పుస్తకాలు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. గిరిజన గురుకుల పాఠశాల బాలికలు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు కార్యక్రమంలో పాల్గొన్న ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి, చిరంజీవి, కృష్ణ నాయక్, సుబ్బరాజు, ఆర్ముఘం, రాజశేఖర్, గిరిధర్, రామాచారి, మాలే గిరిధర్, మునీంద్ర నాయక్, కృష్ణ నాయక్, జివి.రమణ, ఆదినారాయణ, డివియంసి సభ్యులు దేవరాజులు, రాజ్‌కుమార్, బాబు, మునస్వామి పాల్గొన్నారు.



గిరిజనులకు పట్టాలు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలపై

చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ



విద్యార్థులను ఇళ్లకు తిరిగి పంపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రంలో సెలవుల్లో కూడా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం విద్యార్థులకు తరగతులు నిర్వహించడాన్ని శనివారం ఎస్ఎఫ్ఐ ఖండిస్తూ అటువంటి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కాలేజీలు పర్యటించి విద్యార్థులను ఇండ్లకు పంపించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ మసూద్ మాట్లాడుతూ చిత్తూరు నగరంలోని విజ్ఞానసుధా, కేశవరెడ్డి, ఆర్కే చైతన్య వంటి ప్రైవేట్ కాలేజీలు సెలవుల్లో కూడా తరగతులు నిర్వహించి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక క్లాసులు పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. కాలేజీల్లో మౌలిక వసతులు లేకుండా విద్యార్థులు అవస్థలు పడుతున్న పరిస్థితి అని, కనీసం ఆటస్థలం, లైబ్రరీ తదితర సదుపాయాలు కూడా లేవని ఆరోపించారు. పుట్టగొడుగుల్లాగా రోజురోజుకి పుట్టుకొస్తున్న ప్రైవేటు కాలేజీలపై సంబంధిత అధికారులు నిఘా పెట్టాలని, నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. శాస్త్రీయ విద్య కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని, మొదట డిగ్రీ అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు దీపక్, అభినేష్, దిలీప్, భరత్, పవన్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్

ద్విచక్ర వాహనాలు, 30 ఎన్‌డిపిఎల్ ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజల భద్రత, రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకొని, నేరాల నియంత్రణ, అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్ అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ మరియు ఇంచార్జ్ అడ్మిన్ రాజశేఖర్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు సిబ్బందితో సమన్వయంగా విస్తృతస్థాయిలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనుమానాస్పద వ్యక్తులపై తనిఖీలు, వాహనాల పరిశీలన, నేరస్తుల కదలికలపై పర్యవేక్షణ, అక్రమ రవాణా నిరోధక చర్యలు చేపట్టారు. శనివారం జరిగిన కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌లో 11 ద్విచక్ర వాహనాలు, 30 ఎన్‌డిపిఎస్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ప్రతి ప్రాంతంలో పోలీసుల సాన్నిధ్యం స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు, వాహనాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసుల సహాయాన్ని పొందవచ్చని సూచించారు.

దళిత, గిరిజన సమస్యలు కోకొల్లలు..

ప్రజా'దృష్టి'

- స్పెషల్ గ్రీవెన్స్ సెల్ ఎక్కడ..?

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా వ్యాప్తంగా దళిత, గిరిజన సమస్యలు కోకొల్లలుగా పేరుకుపోతున్నాయి. ప్రతి సోమవారం అధికారికంగా నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలకు దళితులు, గిరిజనులు భూ సమస్యలపై అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఏండ్ల తరబడీ అటవీ, ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులు భూ పట్టాల కోసం సుదీర్ఘకాలం పోరాటం చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. అటవీ భూములంటూ పరిష్కరం కాని సమస్యలుగా మిగిలిపోతున్నాయి. గిరిజనులకు అటవీ భ హక్కుల చట్టం ఉన్నా గిరిజనులకు పట్టాలు మంజురు చేయడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని అనేక మండలాల్లో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది.

జిల్లాలోని 600 ప్రాంతాల్లో 60 వేల మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. ఇలా అటవీ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న గిరిజనులు కనీస మౌళిక వసతులైన తాగునీరు, మరుగుదోడ్లు, వీధిలైట్లు, బిటి రోడ్లుకు కోచుకోక దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం రాజ్యాగంలో అర్టికల్ 5,275 ప్రకారం గిరిజనుల భూములు గిరిజన నేతలు కొనుగోలు చేయరాదు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గిరిజనుల సాగులో భూములను అగ్రవర్ణాల వారు ఆక్రమించుకొని గిరిజనులు అడుగుపెట్టనివ్వకుండా చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని సదుం, సోమల, ఐరాల మూడు మండలాల పరిధిలోని ముచ్చుకాలువ గిరిజన తాండాలో 70 కుటుంబాలు 50 ఏండ్లుగా తమ ఆధీనంలోని భూములకు పట్టాలు మంజురు చేయాలంటూ పోరాటం చేస్తున్నారు. ఇదే తరహాలో బంగారుపాళ్యం, మొగిలి, ఊరగుట్ల ప్రాంతంలో 40 కుటుంబాలు ఇండ్ల స్థలలు, సాగుభూముల కోసం పోరాటం సాగిస్తున్నారు. ముచ్చుకాలువ గిరిజనులకు 1990లో నాటి ప్రభుత్వం డికేటి పట్టాలు మంజురు చేసినా గిరిజనులు పూర్తి హక్కును సాధించలేకపోయారు.

ప్రత్యేక గ్రీవెన్స్ ఎక్కడ..?

జస్టిస్ పున్నయ్య కమిషన్ దళిత, గిరిజనుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని 2001లో 694 సిపారస్సు చేసింది. చిత్తూరు జిల్లాలో గత తెలుగుదేశం పాలనలో కొంత కాలం జిల్లా కలెక్టరేట్‌లో దళిత, గిరిజన సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ శనివారం నిర్వహించారు. ఎందుకోగానీ కొంత కాలం తరువాత ప్రత్యేక గ్రీవెన్స్ అవసరం లేదంటూ మానుకుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కర వేదికలో జిల్లా కలెక్టర్‌కు అందుతున్న ఫిర్యాదుల్లో ఎక్కువశాతం దళిత, గిరిజనుల సమస్యలే ఉంటున్నాయి. వీటిల్లో కూడా రెవెన్యూ సమస్యలే అధికం. తిరిగీ దళిత, గిరిజనులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని దళిత, గిరిజన సంఘాల నేతలు కోరుతున్నారు. అలాగే దళిత, గిరిజనుల భూములను అగ్రవర్ణలు ఆక్రమించుకున్నారు. అగ్రవర్ణాల నుండీ రక్షణ కల్పించాలంటూ అధికారులు ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని అనేక మంది గిరిజన పిల్లలకు పుట్టిన రోజును ధృవీకరించే భర్త్ సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డు లేకపోవడంతో పాఠశాలల్లో చేరేందుకు ఆరోగ్యశ్రీ పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రేషన్‌కార్డులను కూడా పొందలేకపోతున్నారు. ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం ద్వారా ఇలాంటి వారి సమస్యలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని గిరిజనులు, దళితులు కోరుతున్నారు.

ప్రభుత్వం మారినా వ్యవస్థలో మార్పు రాలేదు


జాతీయ రహదారి పేరిట ప్రకృతి సంపద దోపిడీ: సీపీఐ 24వ జిల్లా మహాసభలో జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): ప్రభుత్వం మారినా వ్యవస్థలో మార్పు రాలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శనివారం బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీపీఐ 24వ జిల్లా మహసభకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డారు. గత పాలనలో ఐదేళ్లు వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని పాలన మారితే మార్పు వస్తుందనుకుంటే దొందూ దొందే అని అదే విధ్వంసం ఇప్పుడూ జరుగుతోందన్నారు. మహిళలపై తరచూ అత్యాచారాలు జరుగుతోందని, దళితులపై దాడులు జరుగుతూనే ఉందన్నారు. ఏ కార్యాలయానికి వెళ్లినా లంచాలు రాజ్యమేలుతోందన్నారు. లంచాలు ఇవ్వందే ఏ పనీ జరగడం లేదన్నారు. కొండలకు గుండు కొట్టేస్తున్నారన్నారు. కంకర, గ్రావెల్, ఇసుక, మైన్స్ విచ్చలవిడిగా దోపిడీ జరుగుతోందన్నారు. చిత్తం శివుడిపైనా చూపు ప్రసాదంపైన అన్నట్లు జాతీయ రహదారి పేరుతో అన్నీ తమిళనాడుకు తరలించేస్తున్నారన్నారు. తరిగిపోతున్న కొండలు, గుట్టలను పరిశీలించి ఆపేయాలని ఇదివరకే హెచ్చరికలు జారీ చేసామన్నారు. వారు స్టేటెచ్చుకున్నారని స్టేలను లెక్కపెట్టమని యంత్రాలు పగలగొడతామన్నారు. వైఎస్సార్ ఉచిత విద్యుత్ ఇస్తానని హామీ ఇచ్చారని ఆ మేరకు ఉచిత విద్యుత్ సక్రమంగా అమలు చేసినందునే మళ్లీ ఆయనను గెలిపించారన్నారు. ఆయనను చూసే జగన్‌ను కూడా గెలిపించారని ఆయనకు తండ్రిలోని పోలికలు ఒక శాతం కూడా రాలేదని అందుకే ప్రజలు తిరస్కరించారన్నారు. నేడు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అంటూ స్మార్ట్ మీటర్లు పెడుతోందని అవి విష్ణుచక్రాల్లా తిరుగుతోందన్నారు. వందల్లో వచ్చే బిల్లులు వేలల్లో వస్తోందన్నారు. ఆదానీలకు లాభం చేకూర్చడానికే ఈ మీటర్లన్నారు. ఇదిగాక మీటర్లు, ఫోల్లు, వయర్లు వాళ్లవద్దే కొనాలని స్మార్ట్ మీటర్ అంటే విషవలయంలో చిక్కుకున్నట్లే అన్నారు. ప్రజలకు నష్టం చేకూర్చే స్మార్ట్ మీటర్లు పగలగొడతామని హెచ్చరించారు. బీసీలు 52శాతం ఉన్నారని వారికి ఎస్సీలకు కేటాయించినట్లు చట్టసభల్లో రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. వెనుకబడిన వర్గాలు ఉన్నది పల్లకి మోయడానికి మాత్రమే కాదన్నారు. బీసీలు ఎస్సీలకు రాజ్యాధికారం కావాలన్నారు. మహాసభలను పురస్కరించుకొని ఓంశక్తి ఆలయం నుంచి బస్టాండు ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పి.హరినాథ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సహాయ కార్యదర్శి టి.జనార్దన్, నగరి నియోజకవర్గ కార్యదర్శి ఎ.కోదండం, పట్టణ కార్యదర్శి వేలన్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మస్థల ఆలయం ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



ప్రజాశక్తి - తిరుమల: ఓ వివాహ వేడుకకు తిరుమలకు వెళ్లిన సిపిఐ నారాయణ తిరుమలలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తిరుమలలోని శ్రీవారి దర్శనం తాను ఇంకా చేసుకోలేదని పేర్కొన్న నారాయణ తిరుమల శ్రీవారి ఆలయానికి సంబంధించి టిటిడి ట్రస్ట్ ఉందని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు చేస్తుందని వ్యాఖ్యలు చేశారు. ఇక ఇదే సమయంలో కర్ణాటకలోని ధర్మస్థళ ట్రస్ట్ ఒక కుటుంబం చేతిలో ఉందని వ్యాఖ్యలు చేశారు. 500 మందిపై లైంగిక దాడి చేసి హత్య చేసి పూడ్చి పెట్టారన్నారు. ధర్మస్థల ట్రస్ట్‌కు ఏడాదికి వంద కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని పేర్కొన్న నారాయణ ధర్మస్థళ దేవస్థానంలో జరిగిన దారుణాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయన్నారు. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి సిట్ వేసి దర్యాప్తు చేస్తుందని పేర్కొన్నారు. ధర్మస్థళ ట్రస్ట్‌ను వెంటనే ఎండోమెంట్ విభాగం స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. ట్రస్టు చైర్మన్‌తో పాటు సభ్యులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అది దేవస్థాన మా లేక స్మశాన వాటికనా అని ప్రశ్నించారు. ట్రస్ట్ చైర్మన్‌ను, సభ్యులను వెంటనే అరెస్టు చేయాలని నారా యణ డిమాండ్ చేశారు. తవ్వేకొద్దీ పుర్రెలు, ఎముకలు బయట పడుతున్నాయన్నారు. గతంలో సిపిఎం నేత ఎంపీగా పోటీ చేయకూడదని ట్రస్టు సభ్యులు అడ్డుకున్నారని, అతను తెగించి పోటీ చేసినందుకు 15 ఏళ్ల ఆయన కుమార్తెను అత్యాచారం చేసి చంపేశారని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

ముక్కంటి సేవలో హైకోర్టు జడ్జి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర హైకోర్టు జడ్జి తుహిన్ కుమార్ శనివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

రాష్ట్ర ఎస్ఎస్ఏ ప్రాజెక్టు డైరెక్టర్

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరు శ్రీనివాసరావు శనివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అంతకమునుపు ఆయన రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని స్వచ్ఛంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభి దర్శించుకున్నారు. చంద్రబాబు తిరిగి సీఎం కావడంతో కాలినడకన తిరుమలకు వచ్చి మొక్కులు చెల్లింపు చేసుకున్నానని మీడియాతో తెలిపారు. చెత్త రహిత రాష్ట్రంగా, స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర లక్ష్యంగా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ఏపీ అన్నిరంగాల్లో అభివృద్ధి జరిగి, లబ్దిదారులందరికీ సంక్షేమఫలాలు అందించే శక్తి సామర్థ్యాలు మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు ప్రసాదించమని శ్రీవారిని ప్రార్థించానన్నారు.

ముళ్లపొదలకు నిలయం .. పలమనేరు పట్టుగూళ్ల మార్కెట్ ప్రాంగణం

- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని వైనం
- రాత్రి వేళల్లో విష సర్పాల భయం
- భయాందోళనతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిణులు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం)

ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ ప్రాంగణం పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలకు నిలయంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా అధికారు లు ఎవరూ పట్టించుకోకపోవడంతో పట్టుగూళ్ల ప్రాంగణం అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. రాత్రి వేళల్లో విష పురుగులు, సర్పాల భయంతో ఇక్కడ పనిచేసే ఉద్యోగ మహిళలు ఏ నిమిషానికి ఏ ప్రమాదం ముంచుకొస్తుం దోనని భయంతో వణుకుతూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది.

ముళ్ల పొదలకు నిలయం పట్టుగూళ్ల మార్కెట్

పలమనేరు పట్టుగూళ్ల మార్కెట్ ప్రాంగణంలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు ఏపుగా అటవీ ప్రాంతంలా పెరిగాయి. సంవత్సరాలు గడుస్తున్నా వాటిని తొలగించక పోవడంతో అవి మరింత ఏపుగా పెరిగి ఇబ్బందికరంగా మారాయి. అయినా అధికారులు స్పందించడం లేదని స్థానిక ఉద్యోగులు వాపోతున్నారు. ఈ మార్కెట్‌కు చుట్టుపక్కల మండలాలతో పాటు దూర ప్రాంతాల నుండి కూడా పట్టు గూళ్లను అమ్మకానికి తీసుకొస్తుంటారు. వీరికి సరైన దారి సౌకర్యం కూడా లేక ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది.

రాత్రి వేళల్లో విష సర్పాల భయం

ఈ పట్టుగూళ్ల మార్కెట్‌కు దూర ప్రాంతాల నుండి పట్టు గూళ్లను విక్రయించేందుకు లారీలలో డ్రైవర్లు వస్తుంటారు. దీంతో పాటు పట్టుగూళ్ల నుండి దారం తీసే మహిళలు సైతం ఇక్కడే రేయింబగళ్లు పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో పలు సందర్భాలలో చీకటి పడిన తర్వాత కూడా మార్కెట్లో వారు గడపాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవు తోంది. ఈ కారణంగా లారీల డ్రైవర్లు రాత్రి వేళల్లో ఆరు బయట నిద్రించాలంటే ఏ సమయానికి విష పురుగులు, సర్పాలు కాటు వేస్తాయోనని భయాందోళనతో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని వైనం

ఏళ్లు గడుస్తున్నా ఈ పట్టుగూళ్ల మార్కెట్‌లో ముళ్ల పొదలను తొలగించడం లేదు. ఈ ముళ్ల పొందలు తొలగించకపోవడంతో అనేకసార్లు పాములు ప్రవేశించిన సందర్భాలూ వున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ మార్కెట్ లో రోజుకు లక్షల రూపాయలు లేవాదేవీలు జరుగుతూ ఉంటాయని, అయితే సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం విడ్డూరంగా వుందన్నారు. పనిచేసే వారు రాత్రివేళలో బయటకు రావాలంటే భయపడి లోపలే గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధించిన అధికారులు స్పందించి పట్టుగూళ్ల మార్కెట్ ఆవరణలో ముల్లకంపలు తొలగించాలని కోరుతున్నారు.



పట్టుగూళ్ల మార్కెట్ పరిసరాల్లో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు

కడుపు నొప్పితో విద్యార్థిని మృతి


రెడ్డీశ్వరి (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-చౌడేపల్లి: చౌడేపల్లి మండలం దుర్గ సముద్రం పంచాయతీ కేశవపల్లి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. కడుపు నొప్పితో ఓ విద్యార్థిని మృతి చెందింది. మండలం లోని దుర్గ సముద్రం పంచాయతీ కేశవపల్లి కి చెంది న అమాస బాలసుబ్రహ్మణ్యం, గంగులమ్మ ల కుమార్తె రెడ్డీశ్వరి (15)కు విపరీతమైన కడుపు నొప్పి రావడంతో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో స్థానిక ప్రభుత్వ కి తీసుకెళ్లారు. కడుపు నొప్పి తీవ్రం కావడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగా శనివారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో మృతి చెందింది. మృతురాలు చారాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఒక్కగానొక్క కుమార్తె చనిపోయిందని ఇక తమకు దిక్కెవరని తమ కుమార్తె బాగా చదువుకుని తమను వృద్ధాప్యంలో ఆదుకుంటుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, ఇప్పుడు మృతి చెందడం బాధాకరంగా వుందని విలపించారు. గ్రామస్తులు, బంధువులు, తోటి విద్యార్థులు మాట్లాడుతూ రెడ్డీశ్వరి చాలా బాగా చదివేదని ఇంతలోనే చనిపోవడం చాలా బాధాకరంగా వుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఉన్న ఒక్క కుమార్తె చని పోయిందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరుతున్నారు.


మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి కార్యకర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ, బగళనత్తం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నారాయణ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి శనివారం ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అంత్యక్రియలకు ఆ పార్టీ తరఫున పదివేల రూపాయ లు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ పెరుమాళ్, నేతలు చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, గోవిందప్ప, మంజునాథ్, రామేంద్ర నాయుడు పాల్గొన్నారు.



ఎంపీని కలిసిన మండల యూత్ నాయకులు

ప్రజాశక్తి -బంగారుపాలెం: కడప పార్లమెంట్ సభ్యు లు అవినాష్ రెడ్డిని శనివారం పులివెందులలో బంగారుపాలెం మండలం వైసిపి యూత్ నాయకు లు కిషోర్ కుమార్ రెడ్డి , గజేంద్ర ,మహేంద్ర, రఘుపతి రాజు కలిశారు. దుశ్శాలువతో సత్కరించారు.



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

గురువులకు సన్మానం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 -2000 సంవత్సరంలో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థుల గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించి అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో విద్యార్థులు ఉన్నత పాఠశాలకు చేరుకొని గురువులైన వెంకటరమణ, అనసూయమ్మ, శంకర్ రెడ్డి కృష్ణమరాజు, జనార్ధనరాజు, శివశంకర్‌లను దుశ్శాలువలతో సన్మానించి మెమెంటోలు అందించి పాదపూజ చేశారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి 50 వేల రూపాయల విరాళాన్ని, పాఠశాల గ్రంథాలయంలో ఫర్నిచర్ కోసం ఐదువేల రూపాయల విరాళాన్ని పూర్వ విద్యార్థులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లోకేశ్వరి, పూర్వ విద్యార్థి మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు యదు శేఖర నాయుడు, విద్యార్థులు కుమార్, మస్తాన్ 30 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ పాలకమండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదల



ప్రజాశక్తి-చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయ పాలకవర్గ నియామకానికి నోటిఫికేషన్ విడుదల అయినట్లు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం శనివారం తెలిపారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు ఆయన వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 27వ తేదీ లోపు బోయకొండ గంగమ్మ దేవస్థానంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనలు మేరకు దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు దేవస్థానంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని సన్నిధిలో ఏపీ జస్టిస్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండల పరిధి, అప్పలాయిగుంట, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ జస్టిస్ తుహిన్ కుమార్ కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి, శ్రీవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, తిరుపతి ప్రోటోకాల్ కోటేశ్వరరావు, ధనుంజయ నాయుడ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.




పూజలు నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ఎంపీని విడుదల చేయాలని పూజలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని, ఆయనను వెంటనే బెయిల్ వచ్చి విడుదల కావాలని కోరుతూ వైసిపి రాష్ట్ర కార్యదర్శి, చిత్తూరు జిల్లా ఎంపీపీల అధ్యక్షులు, బైరెడ్డిపల్లి ఎంపిపి ఎం రెడ్డప్ప ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 101 కొబ్బరి కాయలు కొట్టారు. మండల ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వైస్ సర్పంచులు , వైసిపి కుటుంబ సభ్యులు ప్రత్యేక అభిషేకం నిర్వహించి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద అందరూ కలిసి 101 కొబ్బరి కాయలు కొట్టారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై కక్షగట్టి అరెస్టులు చేయిస్తోందన్నారు. త్వరలోనే నిజం తెలిసి మిథున్‌రెడ్డి బయటకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి రూపా జై కుమార్, మహేష్, స్థానిక జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

సోమల: అక్రమ కేసులో ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని ప్రభుత్వం నిష్కారణంగా అరెస్టు చేసి జైల్లో వుంచిందని, వెంటనే బెయిల్‌పై విడుదల చేయాలని కోరు తూ సోమల సమీపంలోని శ్రీ భూనీల ప్రసన్న వెంకటేశ్వ ర స్వామి ఆలయం వద్ద వైసీపీ శ్రేణులు101 కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమల మాజీ సర్పంచ్ శ్రీరాములు, సీనియర్ నాయకులు వరద వెంకట రమణ, చంద్రమౌళి నెల్లిమంద చంద్రన్న పొదలగుంటపల్లి గిరి, విజయ్ కుమార్, సాంబయ్య , విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరమణ, గన్నువారిపల్లి శ్రీకాంత్, శీలం భాస్కర్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని అరగొండ శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం శ్రావణ పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 నుండి 10 వరకు ప్రత్యేక అభిషేకాలు, 11 నుండి 12గంటల వరకు సుదర్శన హోమం, సాయంత్రం 7 గంటలకు ప్రాకారోత్సావం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వీధి నాటకాలు నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు, మండల ప్రజలు, కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల నుండి భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో హనుమంతరావు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం


భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థికసాయం అందిస్తున్న దాత

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: భవన నిర్మాణ కార్మికుడికి జీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత మొగిలీ శ్వర నాయుడు శనివారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని తగ్గువారి పల్లి పంచాయతీకి చెందిన మురుగేష్ నెల క్రితం ఓ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. అతని చికిత్స నిమిత్తం 25 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించామని జిఆర్ కన్‌స్ట్రక్షన్ సిబ్బంది తెలిపారు. నగదు అందుకున్న మురుగేష్ మొగిలీశ్వర నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిఆర్ కన్‌స్ట్రక్షన్ సిబ్బంది కృష్ణ, బుజ్జి, తగ్గువారిపల్లి యువత పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలోని పాత వెంకటాపురం పంచాయతీ గరిగలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి, దక్షిణామూర్తి , మహాలక్ష్మి, విద్యా సరస్వతి నూతన విగ్రహ ప్రతిష్టకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో పాటు ఈనెల 11 నుంచి 13 వరకు మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తు లు తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనాలని గరిగలపల్లి గ్రామస్తులు కోరారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించండి: ఎంపీడీవో



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రతి శుక్రవారం మండలంలో ప్రజలు డ్రైడే పాటిస్తూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్య అధికారి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని చెప్పిడి పల్లి పంచాయతీ పరిధిలో ఉన్న జంగాల అగ్రహారం గ్రామాన్ని ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ ఆధ్వర్యంలో మండల వైద్య అధికారి విజయ్ చంద్ర, వైద్య బృందం కలిసి గ్రామంలో పర్యటించారు గ్రామంలో ఉన్న ప్రజలకు సీజన్ వ్యాధుల గురించి, పరిసర ప్రాంతాల పరిశుభ్రత గురించి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలని వారికి దగ్గు, జ్వరం జబ్బులు వున్నాయని తెలిసిన వెంటనే డాక్టర్లు సలహా తీసుకొని తగిన మందులు వాడాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకుని భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత తప్పక సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. పాన్, మద్యపానం, ధూమపానాలకు దూరంగా వుండాలని డాక్టర్ విజయచంద్ర పేర్కొన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ విజయచంద్ర, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, స్థానిక సర్పంచ్ విజయ ప్రకాష్. ఆశ వర్కర్ జమున అనిత ఆరోగ్య సూపరువైజర్ రెడ్డమ్మ రాజారెడ్డి ఎంఎల్ హెచ్‌పి అశ్విని, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు శ్రీకాళహస్తిలో గ్రీవెన్స్ సెల్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక పంచాయతీ రాజ్ అతిథిగృహంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ కు హాజరవుతారని చెప్పారు. నియోజవర్గ పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



తవణం పల్లెలో గర్భిణులకు పౌష్టిక ఆహారం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రొంపిచర్ల : రొంపిచర్ల మండలం ప్రాథమిక అరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్'ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు వినయ్ గర్భిణులకు వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అర్హులైన గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల ఆరోగ్య వైద్యాధికారి రాజేశ్వరి గర్భిణులకు అవగాహన కల్పించారు. ప్రతినెలా వైద్య పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు, చేసుకోవాలని అంగన్‌వాడీ కేంద్రం నుంచి పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేసుకోవాలన్నారు. 108ను కాన్పుకు, 104 వైద్య సేవలకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ అమ్మని, సూపరు వైజరు పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు, అరోగ్య కార్యకర్త లు, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు.

తవణం పల్లె: తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మండలంలోని 35 మంది గర్భిణులు పరీక్షల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హాజరయ్యారు. మండల వైద్య అధికారి డాక్టర్ టి ప్రియాంక వారికి గర్భిణీ వైద్య పరీక్షలు నిర్వహించి అందులో హై రిస్క్ గర్భిణులను గుర్తించి చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అరగొండ అపోలో టోటల్ హెల్త్ వారి ఆధ్వర్యంలో ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ప్రేమానంద్, జనరల్ మేనేజర్ డాక్టర్ అరుణ్ గంగాధర్ , డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో గర్భిణులకు మధ్యాహ్న భోజనం (పౌష్టిక ఆహారం) అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వోలు జ్ఞాన శేఖర్, రాజమణి పిహెచ్‌ఎన్, జీవకళ, ఆరోగ్య పర్యవేక్షకులు గోపి , నిర్మలమ్మ , రెడ్డమ్మ ఎఎన్‌ఎంలు, ఎఎల్‌హెచ్‌పిలులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: సూపర్ స్టార్ మహేష్‌బాబు 50వ పుట్టినరోజు వేడుకలను కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ గౌరవధ్యక్షులు లోకనాథ్ ఆధ్వర్యంలోఘనంగా శనివారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం ఆధ్వర్యంలో గంగాధర నెల్లూరు బస్టాండ్ కూడలిలో భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం స్థానిక సాంఘిక, సంక్షేమ బాలికల హాస్టల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు రాజేం ద్ర, మోహన్, రాజా, ప్రేమ్, మండల ఫ్యాన్స్ నీరజా క్షులు, కృష్ణన్, హరికృష్ణ రెడ్డి, నక్షత్రం, హరిబా బు, ఢిల్లీ కుమార్, మోహ న్, మదన్, మహేష్, శేఖర్, సురేష్, సుధీర్, వెంకటేష్, పలువురు మహేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేపీ శ్రీధర్ కార్యాలయంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో మహేష్ బాబు అభిమానులు భారీ ఎత్తున రక్తదాన కార్యక్రమం చేపట్టారు. రాజీవ్ గాంధీ విగ్రహం సర్కిల్‌లో అన్నదానం , హాస్పిటల్ వద్ద అన్నదానం నిర్వహించారు. పెనుమూరు మండలం శాతంబాకం లో 5 ఏళ్ల క్రితం మహేష్ బాబు ఫౌండేషన్ ద్వారా గుండెకు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్న చిన్నారి భైరవ సింధు కుటుంబ సభ్యులు , గ్రామ ప్రజలు నేతృత్వంలో మహేష్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోకొంబు , రావూరి రవి, ప్రతాప్ , దీనా, మోహన్ , శరవణ, ప్రేమ్, రాజా, ముని , అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీల దినోత్సవం

ప్రజాశక్తి- రామకుప్పం: రామకుప్పంలో అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవాన్ని గిరిజనులు, ప్రజాప్రతినిధులు, నేతలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలోని బందార్లపల్లి క్రాస్ వద్ద నుంచి విజలాపురం కూడలి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పుల వాయిద్యాలు, టపాకాయలు బాణాసంచా పేల్చి ర్యాలీ నిర్వ హించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మధ్యాహ్నం ఒక్క సారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఇక్కడ ఏర్పాటు చేసిన షామియానా ఈదురు గాలు లకు ఎగిరి పక్కనే ఉన్న కరెంటు లైన్ పై పడగ కుర్చీలు చిందరవందర అయ్యాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మునస్వామి, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, కృష్ణ నాయక్ ,రామ్మూర్తి, గంట్లప్ప గౌడు, సుబ్రీ, కామరాజు నాయక్, రఫీ,రవి రెడ్డి, భూపతి, చంద్రబాబు నాయక్ పాల్గొన్నారు.


రామకుప్పంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



ప్రజాశక్తి -సోమల: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' లో భాగంగా సోమల ఎస్ నడింపల్లి పొదలకుంటపల్లి 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీలలో వైసిపి మండల నాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగాఎంపీపీ ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎడాపెడ హామీలను ఇచ్చి ఆ తర్వాత రోజులు గడుస్తున్న వాటిని అమలు చేయడంలో విఫలం అయ్యారని ఎద్దేవా చేశారు. వైస్ ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన ఫలాలను అందించకపోగా మాయ మాటలు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్లు నాగేశ్వ ర రావు అమాస మోహన్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు గంగాధర్ రాయల్, మస్తాన్, వాసు దేవయ్య , మహేష్, ఐలా వెంకట రమణ, నాగభూషణం పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు పరిశీలన



ప్రజాశక్తి-పెద్దపంజాణి: జాతీయస్థాయి పర్యవేక్షణ బృందం అధికారులు శనివారం మండలంలోని కోగిలేరు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారా అమలవుతున్న ఉపాధి హామీ, హౌసింగ్, పెన్షన్లు, స్వయం సహాయక సంఘాల రుణాల మంజూరుపై లబ్ధిదారులతో నేరుగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం నుండి పలు పథకాల ద్వారా మంజూరు అవుతున్న నిధులు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయా? లేదా అని ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరైన నిధులతో లబ్ధి పొంది సంతోషంగా ఉన్నారా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించడంతో ఉపాధి హామీ వేతన దారులు పనులు చేసుకోవడానికి కొత్తగా పనిముట్లు ఇవ్వాలని,దినసరి వేతనం పెంచాలని కోరడంతో వారి వినతి మేరకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.అనంతరం గ్రామ పంచాయతీ అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు ఆ నిధులతో చేపట్టిన పను ల వివరాలను అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరైన నిధులతో గ్రామపంచాయితీ పరిధిలో చేపట్టిన కొన్ని పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులగంటి రమేష్ బాబు, జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ అధికారులు సునీల్, మణికంఠన్, ప్రశాంత్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శారదా దేవి, ఏపీవో మురుగేషన్, ఏపీఎం నీరజ, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, ఎంసీఓ సుధాకర్, సచివాలయ సిబ్బంది, నాయకులు నాగేశ్వరరావు, రామచంద్ర, బాలాజీ,శంకర్,పరమేశ్వర పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పాత మీటర్లే ముద్దు స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి పిలుపు నిచ్చారు. సిపిఐ కార్యాలయంలో సిపిఐ తిరుపతి నగర కార్యదర్శి జెల్ల విశ్వనాథ్, సిపిఎం నగర కార్యదర్శి వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాత మీటర్లు ముద్దు స్మార్ట్ మీటర్లు వద్దు, అదానికి రాష్ట్ర ప్రజానీకాన్ని తాకట్టు పెట్టవద్దని కోరారు. ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులకొట్టండని సూచించారని, కానీ అధికారం వచ్చాక మాట మార్చారని ఆరోపించారు. గత పాలకులు లోపాయకారి ఒప్పందాలు రద్దుచేస్తామని హామీ ఇచ్చి నేడు విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలపై భారం మోపడమేమిటని ప్రశ్నించారు. 11వ తేదీన వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపును అమలు చేయడం జరుగుతుందని అందులో భాగంగా ఎస్.పి.డి.సి.ఎల్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ నారాయణ పాల్గొంటున్నారని, పెద్ద ఎత్తున ప్రజానీకం ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెంచలయ్య, రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్ డి రవి, కేవై రాజా, శ్రీరాములు, శివ, గోవిందస్వామి, పద్మనాభ రెడ్డి, మహేంద్ర, శ్రీనివాసులు, పురుషోత్తం, రాజశేఖర్, సిపిఎం నాయకులు మురళి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.


సోదరునికి రాఖీ కడుతున్న మాజీ మంత్రి ఆర్‌కె రోజా

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : అనుబంధాలకు ప్రతీకగా, మమతానురాగాలకు నెలవుగా నిర్వహించుకునే పండుగ రక్షాబంధన్ అని మాజీ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. శనివారం రాఖీ పండుగను పురస్కరించుకొని తిరుపతిలోని తన సోదరుని నివాసంలో ఆమె రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. సోదరుడు కుమారస్వామి రెడ్డికి, నగరి పట్టణంలోని తన నివాసంలో సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డికి రాఖీ కట్టి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సాంప్ర దాయాలకు నిదర్శనంగా ఆత్మీయంగా ఆచరించే శుభపర్వదినమైన రాఖీ పౌర్ణమిని నిర్వహించుకోవడం చాలా ఆనందాన్ని ఇస్తుందన్నారు. అన్నా చెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ల తమ మధ్యన ఉండే ప్రేమానురాగాలకు ప్రతీకగా ఈ పండుగను నిర్వహించు కుంటారన్నారు. ప్రతి ఏడాది తన అన్నయ్యలకు రాఖీ కడుతానన్నారు. రాఖీ పండుగ సందర్భంగా తన సోదరులు ఎప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు.


గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

వైద్య పరీక్షలు తప్పనిసరి..

ప్రజాశక్తి -సోమల: గర్భం దాల్చినప్పటి నుండి ప్రతివారం తర్వాత వైద్యుల సలహాలు సూచనలు, పాటించి సుఖవంతమైన ప్రసవానికి సహకరించాలని వైద్యులు సూచించారు. మండలంలోని సోమల పెద్ద ఉప్పరపల్లి కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో శనివారం పీఎం ఎస్ఎంఏ గర్భిణులకు వైద్య పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భవతులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని రక్తపరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకోవాలని గర్భస్థ పరీక్షలు ఐరన్ పోలిక్ మాత్రలను తప్పక తీసుకోవాలని ఆకుకూరలు, గుడ్లు, మాంసకృతులు ఆహారంలో తప్పక వాడాలని అప్పుడే అటు గర్భిణి ఇటు గర్భంలోని బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు గర్భిణులు పాల్గొన్నారు.


గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సిసి రోడ్లు

పలు గ్రామాల దారులకు మోక్షం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండల పరిధిలోని పలమనేరు శంకరరావుపేట రహదారి నుండి వెళ్లే చౌడేరెడ్డిపల్లి చెన్నారెడ్డిపల్లి కంగానంబండ కురపల్లి గ్రామాలకు వెళ్లే దారులు ఐదు సంవత్సరాల క్రితం కంకర తోలి వదిలేశారు. ఈ నేపథ్యంలో ఈ గ్రామస్తులు తమ గ్రామాలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుత శాసనసభ్యులు అమరనాథరెడ్డి చొరవ తీసుకొని ఈ గ్రామాలకు రహదారి నుండి సిసి రోడ్లు మంజూరు చేయించి పనులు పూర్తి చేసుకోవడంతో ఈ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఎన్నో ఏళ్లుగా మా గ్రామాలకు సక్రమమైన ధర లేకపోవడం తో రైతులు పండించిన పంటలు మార్కెట్లకు తీసుకువెళ్ల లేకపోతున్నామని గ్రామాలలో ఎవరికైనా ఆరోగ్యం సరిలేకపోవడంతో కనీసం ఆటోలు కూడా గ్రామాలలోకి వచ్చేవి కాదని, ద్విచక్రాలు సైతం వెళ్లడానికి ఇబ్బందిగా ఉండేదని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.. తమ బాధను అర్థం చేసుకొని గ్రామాలకు సిసి రోడ్లు వేయించి రవాణ సౌకర్యం కల్పించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.